మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...





Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :69 | శుక్రవారం , 07 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

# 'పాలమూరు'కు జాతీయ హెూదా ఇవ్వలేం

## లోక్‌సభలో తేల్చిచెప్పిన కేంద్ర ప్రభుత్వం

పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో తేల్చిచెప్పింది. ఎంపీ బలరాం నాయక్ అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో గురువారం కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ టెక్నో ఎకనామిక్ అప్రైజల్ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. అలాగే కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అడ్వైజరీ కమిటీ అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు టెక్నో - ఎకనామికల్ అనుమతుల కోసం 2022 సెప్టెంబర్‌లో తెలంగాణ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను సీడబ్ల్యూసీకి సమర్పించిందని తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును తెలంగాణ కృష్ణా నదీ జలాలపై తలపెట్టిందని అన్నారు. కృష్ణా నది జలాల కేటాయింపు వివాదాలను పరిష్కరించే బాధ్యతను కేడబ్ల్యూడీటీ -2 (బ్రజేశ్ కుమార్ ట్రిబ్యునల్)కు అప్పగించామని, ఇప్పుడు ఈ అంశం న్యాయస్థానం (ట్రిబ్యునల్) పరిశీలనలో ఉందని వివరించారు. అలాగే ఈ ప్రాజెక్టు అనుమతులకు ఇంటర్ స్టేట్ డిస్ప్యూట్స్ అడ్డంకిగా ఉన్నాయని తెలిపారు. న్యాయవివాదాలు, నీటి కేటాయింపుల అంశం తేలకుండా పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ స్కీంకు టెక్నో - ఎకనామికల్ అనుమతులు ఇవ్వలేమని.. అది తేలితేగాని ప్రాజెక్టుకు నేషనల్ స్టేటస్ ఇచ్చే అంశంపై నిర్ణయం తీసుకోలేమని తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హెూదా ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.


2లో

# సీఎం రేవంత్ పై తిరగబడ్డ మంత్రి?

## అసలు కాంగ్రెస్ లో ఏం జరుగుతోంది?

కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి సెగలు చల్లారడం లేదు. ఈ అసమ్మతి సెగలు బెంగళూరు వరకు చేరుకున్నట్లుగా తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా బెంగుళూరులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కలిసినట్లుగా తెలుస్తోంది. బుధవారం రాత్రి బెంగుళూరులో కృష్ణ, తుంగభద్రకు నీటి విడుదల విషయమై వీరంతా అక్కడికి వెళ్లి ఖర్గేను కలిశారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేను తీసుకొస్తే కనీసం తనకు ప్రాధాన్యం కూడా ఇవ్వడం లేదని కనీసం తనకు సహకరించడం లేదంటూ ఖర్గే వద్ద మంత్రి జూపల్లి వాపోయారట.


2లో

# కొత్త రేషన్ కార్డుల జారీలో బిగ్ ట్విస్ట్


2లో

తెలంగాణ సర్కార్ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్న సంగతి తెలిసిందే. రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న నాలుగు కొత్త పథకాలను ప్రారంభించగా.. అందులో రేషన్ కార్డుల జారీ కూడా ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవటంతో పెద్ద ఎత్తున అప్లికేషన్లు వచ్చాయి. దాదాపు 10 లక్షలకు పైగా దరఖాస్తులు రాగా.. గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తున్నారు. ఇప్పటికే మండలానికి ఓ గ్రామం చొప్పున రేషన్ కార్డుల మంజూరు చేశారు.

# పార్టీ గీత దాటితే వాతే...

## సీక్రెట్ మీటింగులు పెడితే కఠిన చర్యలు

### సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్..!

తెలంగాణలో రాజకీయాలు రంజుగా మారుతున్నాయి. అధికార ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ఆరోణపణలు జోరుగా సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే.. కాంగ్రెస్ పార్టీలో కొన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటు న్నాయి. మొన్ననే కొంత మందిఎమ్మెల్యేలు.. ప్రత్యేకంగా మీటింగ్ పెట్టుకోవటం సర్వత్రా చర్చనీయాంశంగా మారగా.. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీరు వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలో.. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో.. పార్టీ లైన్ దాటుతున్న నేతల విషయంపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో నేతలకు సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్టు తెలుస్తోంది.


2లో

### సీఎల్పీ సమావేశానికి పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు డుమ్మా

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగుతున్న సీఎల్పీ సమావేశం కొనసాగుతోంది. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో సమావేశం జరుగుతుండగా.. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యచరణపై చర్చిస్తున్నారు.సమావేశానికి 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

2లో

### స్థానిక సంస్థల ఎన్నికల బాధ్యత ఎమ్మెల్యేలదే - సీఎం రేవంత్

తెలంగాణలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. గురువారం రోజు హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి.. ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ప్రాభవాన్ని నిలబెట్టుకోవాలని.. ప్రతీ స్థాయిలో విజయాన్ని సాధించాలని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

2లో

# సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా యూజీసీ కొత్త నిబంధనలు



ఢిల్లీలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం భేటీ అయ్యింది. యూజీసీ నిబంధనల పై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కలిసి వినతి పత్రం ఇచ్చింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. యూజీసీ నూతన మార్గదర్శకాల పై మా అభిప్రాయాలను నివేదించాం. దీనికోసమే కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కలిశామన్నారు. రాష్ట్ర వర్సిటీల్లో సెర్చ్ కమిటీ బాధ్యతను గవర్నర్‌కు అప్పగించేలా యూజీసీ నిబంధనలు రూపొందించా రన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు.

2లో

# రేవంత్ పై టాలీవుడ్ తిరుగుబాటేనా?


గద్దర్ అవార్డుకు పోటీగా ఫిల్మ్ చాంబర్ అవార్డులు



2లో

# నేటిమాట

ప్రాచీనమైనంత మాత్రాన ప్రతిదీ మంచిది గాదు. ఆధునికమైందని త్యజించాల్సిన అవసరమూ లేదు. సజ్జనులు పరీక్షించి మంచి దాన్ని ఎంచుకొంటారు. మూరు?లు ఇతరులు చెప్పిందాన్ని గుడ్డిగా నమ్ముతారు.



-మహాకవి కాళిదాసు

# తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీస్


2లో

తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంటున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చింతపండు నవీన్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ భారీ షాక్ ఇచ్చింది. ఓ సామాజిక వర్గాన్ని దూషిస్తుండడమే కాకుండా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా.. రేవంత్ రెడ్డిపై దుర్భాషలాడడం.. ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ చర్యలకు ఉపక్రమించింది. ఈ క్రమంలో వివరణ ఇవ్వాలని నోటీసు అందించింది. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం మల్లన్నకు నోటీసులు పంపించింది. ఫిబ్రవరి 12వ తేదీలోపు వివరణ ఇవ్వాలని ఆదేశాల్లో కాంగ్రెస్ పార్టీ పేర్కొంది.

# 14 నెలలు గడుస్తున్నా..

## కేసీఆర్ మీద ఇంకా రేవంత్ రెడ్డి ఏడుపా?


2లో

అన్నింట్లో విఫలమైన రేవంత్ రెడ్డి పాలనతో తెలంగాణ కుక్కలు చింపిన విస్తరిలా మారిందని.. 14 నెలలైనా ఇంకా మాజీ సీఎం కేసీఆర్‌పై ఏడుపా? అని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల గణన అంటూ తప్పుల తడక చేసి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రేవంత్ రెడ్డి చేసిన చిల్లర ప్రయత్నం అని మండిపడ్డారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పక్కా అని స్పష్టం చేశారు. దీనిపై ఎలాంటి విచారణ అయినా కూడా చేసుకోమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జగదీశ్ రావు సవాల్ చేశారు.సూర్యాపేటలో గురువారం జగదీశ్ రెడ్డి మీడితో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి చేపట్టిన కుల గణనను తప్పుబట్టారు. బీసీ జనాభా లెక్కలపై విస్మయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డిపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కుక్కలు చింపిన విస్తరిలా కాంగ్రెస్ పాలన తయారైందని అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదని విమర్శించారు.

# సచివాలయంలో నకిలీ ఉద్యోగులు


2లో

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సచివాలయం నేడు నకిలీ ఉద్యోగులతో నిండిపోయిందా అంటే అవుననే సమాధానం వస్తోంది. తెలంగాణ సచివాలయంలో మరోసారి భద్రతా లోపం బయటపడింది. ఫేక్ ఐడెంటీ కార్డులతో ఉద్యోగులు కానీ వారు కూడా సచివాలయంలోకి ఎంట్రీ ఇస్తున్నారు. దీంతో ఎవరు నకిలీనో ఎవరు అసలో తెలియక పోలీసులు, సామాన్యులు తలలు పట్టుకుంటున్నారు. రోజుకో నకిలీ ఉద్యోగిని పట్టుకుంటున్నారు సచివాలయ భద్రతా సిబ్బంది. కొంపల్లి అంజయ్య అనే వ్యక్తి తహసీల్దార్ పేరిట సచివాలయంలోకి వచ్చినట్లు సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు.

# 'పాలమూరు'కు జాతీయ హోదా ఇవ్వలేం

### -లోక్‌సభలో తేల్చిచెప్పిన కేంద్ర ప్రభుత్వం

## హైడ్రాలజీ క్లియరెన్స్ కోసం కేసీఆర్ తండ్లాట.. పట్టించుకోని రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

పాలమూరు – రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కృష్ణా మిగులు జలాలపై ప్రతిపాదించారు. రోజుకు 2 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 120 టీఎంసీలు లిఫ్ట్ చేసేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జలాల్లో జరిగిన అన్యాయాన్ని ఈ ప్రాజెక్టు ద్వారా సరి చేయాలని కేసీఆర్ సంకల్పించారు. ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలంటే ఆ ప్రాజెక్టుకు నికర జలాల కేటాయింపు ఉండి తీరాలి. ఇందుకోసమే కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు 90 టీఎంసీల నికర జలాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. మైనర్ ఇరిగేషన్ కు కేటాయించిన 90 టీఎంసీల్లో 45 టీఎంసీల సేవింగ్స్ (పొదుపు) చూపించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టుకు ఇవ్వాలని సంకల్పించిన 35 టీఎంసీలకు తోడు మిగిలిన పది టీఎంసీలు కలిపి మరో 45 టీఎంసీలు (పోలవరం నుంచి కృష్ణా డెల్టా నీటిలో తెలంగాణకు దక్కే కృష్ణా నికర జలాలు 45 టీఎంసీలు) పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలకు కేటాయించింది. ఏపీ కొర్రీలు పెట్టడంతో ఈ ప్రతిపాదన ముందుకు పడలేదు. సీడబ్ల్యూసీలోని హైడ్రాలజీ డైరెక్టరేట్ వద్ద సమర్థ వాదనలు వినిపించాల్సిన రేవంత్ సర్కారు ఆ విషయాన్ని గాలికొదిలేసింది. ఫలితంగా ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు తేలేవరకు పాలమూరుకు అనుమతులు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. పాలమూరుకు తుది పర్యావరణ అనుమతులు ఇస్తూ కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ (ఈఏసీ) నిర్ణయం తీసుకున్నా అది న్యాయవివాదంలో చిక్కుకుంది. దానిని క్లియర్ చేయిస్తే పూర్తి స్థాయిలో ప్రాజెక్టు పనులు చేసుకునే అవకాశమున్నా ఆ దిశగా రేవంత్ రెడ్డి సర్కారు కనీసం ప్రయత్నించడం లేదు.

# రేవంత్ సర్కారు నిర్లక్ష్యం..

### 'పాలమూరు'కు శాపం : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యం పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలకు శాపంగా మారిందని ఎమ్మెల్సీ కవిత 'ఎక్స్' వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభలో ఎంపీ బలరాం నాయక్ ప్రశ్నకు కేంద్ర మంత్రి ఇచ్చిన సమాధానాన్ని తన ట్వీట్‌కు జత చేశారు. "14 నెలలుగా పాలమూరు ఎత్తిపోతలను కోల్డ్ స్టోరేజీలో పెట్టిన రేవంత్ సర్కారు.. ప్రాజెక్టుకు అనుమతుల సాధనను గాలికొదిలేసింది. కేసీఆర్ హయాంలో సాధించిన పర్యావరణ అనుమతులను న్యాయవివాదాల సుడి నుంచి బయటకు తేలేకపోయింది. ఎంతో ముందు చూపుతో కేసీఆర్ పాలమూరుకు 90 టీఎంసీల నికర జలాలు కేటాయించి ప్రాజెక్టును గట్టెక్కించే ప్రయత్నం చేస్తే.. ఆ విషయాన్ని కేంద్రానికి సరిగా చెప్పలేక తుది అనుమతులను ఇంకింత సంక్లిష్టం చేసింది. వెరసి.. కృష్ణా జలాల నీటి కేటాయింపులు తేలేవరకు పాలమూరు – రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలేమని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం తేల్చిచెప్పింది. నల్లమల బిడ్డనని చెప్పుకునే రేవంత్ రెడ్డి గారు.. పాలమూరు ప్రాజెక్టు విషయంలో మీ చిత్తశుద్ధి ఏపాటిదో ఈ రోజు తేలిపోయింది.." అని పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ పై తిరగబడ్డ మంత్రి?

### అసలు కాంగ్రెస్ లో ఏం జరుగుతోంది?

మొదటి పేజీ తరువాయి

ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి, దీపాదాస్ మున్షీ మీటింగ్ ఉండగా ఖర్గేను కలిసి గోడు వెళ్లబోసుకున్నారట జూపల్లి. మరోవైపు గద్వాల నియోజకవర్గంలో తనకు ప్రాధన్యత ఇవ్వకుండా సరితా తిరుపతయ్యకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఖర్గే వద్ద ఆవేదన వ్యక్తం చేశారట. తన నియోజకరవర్గంలో ఉప ఎన్నికలు వస్తే తన పరిస్థితి ఏంటని ఎమ్మెల్యే అయోమయంలో పడ్డారని తెలుస్తోంది. దీనిపై మల్లిఖర్జున ఖర్గే కూడా చాలా సానుకూలంగా స్పందించారని వార్తలు వస్తున్నాయి. జూపల్లి వెంట ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, గవినోళ్ల మధుసూదన్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ కర్ణాటకకు వెళ్లారు.

### సీఎం రేవంత్ మీటింగ్

కాంగ్రెస్ శాసనసభాపక్షం గురువారం సమావేశం కానుంది. హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలో సీఎం రేవంత్ అధ్యక్షతన ఈ భేటీ జరగనుంది. ఎమ్మెల్సీ ఎలక్షన్స్, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు, కులగణన, ఎస్సీ వర్గీకరణను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ప్రధానంగా ఈ భేటీలో చర్చించనున్నారు. ఇటీవల అసంతృప్త ఎమ్మెల్యేల భేటీ అంశాన్ని కూడా ఈ మీటింగ్ లో ప్రస్తావిచ్చే అవకాశం ఉందని సమాచారం. ఈ భేటీలో రాష్ట్ర ఇంఛార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా కూడా పాల్గొననున్నారు.

### ఢిల్లీకి సీఎం రేవంత్

ఈ మీటింగ్ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఆయన వెంట పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా వెళ్లనున్నారు. ఈ పర్యటనలో తమ పార్టీ అధ్యక్షుడు ఖర్గేతో పాటుగా పలువురు అగ్రనేతలతో సీఎం భేటీ కానున్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ సహా పలు నిర్ణయాలపై అధిష్ఠానానికి రేవంత్ వివరిస్తారని తెలుస్తోంది. ఇక రాష్ట్రంలో పార్టీ కూర్పు, మంత్రివర్గ విస్తరణ, ఎమ్మెల్యేల విషయంపైనా ఆయన చర్చించవచ్చని సమాచారం.

# కొత్త రేషన్ కార్డుల జారీలో బిగ్ ట్విస్ట్

### మార్చి31 లోగా అర్హులైన అందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

మొదటి పేజీ తరువాయి



అయికే అనర్హులకు కాకుండా అర్హులకు మాత్రమే కార్డులు మంజూరు చేయాలని సర్కార్ భావిస్తోంది. గతంలో అక్రమంగా కార్డులు పొందిన వారి కార్డులు కట్ చేయాలని సర్కార్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. రేషన్ కార్డులు పొందాలంటే కొన్ని నిబంధనలు ఉన్నాయి. పేదలకు మాత్రమే కార్డులు మంజూరు చేస్తారు. గ్రామీణ ప్రాంతంలో రూ. 1.50 లక్షలు, అర్బన్ రూ. 2 లక్షల్లోపు ఆదాయం ఉన్నవారికి కార్డులు జారీ చేస్తారు. ఇక భూ విస్తీర్ణం విషయానికి వస్తే.. తరి భూమి అయితే 3.5 ఎకరాలు, మాగాణి భూమి అయితే 7.5 ఎకరాలలోపు ఉండాలనే నిబంధనలు అమలు చేస్తున్నారు. ఈ నిబంధనలు పక్కాగా పాటించాలని సర్కార్ యోచిస్తోంది.అందుకు సరికొత్త సాఫ్ట్‌వేర్ ఉపయోగించి అర్హులను ఎంపిక చేయనుంది. 360 డిగ్రీ సాఫ్ట్‌వేర్ సాయంతో రేషన్ కార్డులకు అప్లై చేసుకున్న వారి ఆదాయ వివరాలను తెలుసుకోనున్నారు. ఆధార్ కార్డు ద్వారా స్కాన్ చేసి దరఖాస్తుదారులకు కారు, ఇండ్లు, ప్లాట్లు ఉన్నాయా? అనే విషయాన్ని పూర్తిగా పరిశీలిస్తున్నారు. ఒకవేళ నిబంధనలకు లోబడి లేకుంటే అలాంటి వారికి కార్డులు జారీ చేయరు. ఇప్పటికే కార్డుల పొందిన వారిని కూడా అనర్హులుగా ప్రకటించే ఛాన్స్ ఉంది. ఈ మేరకు అధికారులు కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగిదే రాష్ట్రంలో లక్షల మందికి ఉన్న రేషన్ కార్డులు పోయే పరిస్థితి ఏర్పడే ఛాన్సుంది.

# పార్టీ గీత దాటితే వాతే...

### సీక్రెట్ మీటింగులు పెడితే కఠిన చర్యలు

### సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్..!

మొదటి పేజీ తరువాయి

ఎవరైనా నేతలు కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను వ్యతిరేకిస్తే.. కఠినంగా వ్యవహరించాలని సీఎల్పీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. పార్టీ విధానాలపై ఎవరికైనా అనుమానాలు ఉంటే.. అంతర్గతంగా చర్చించాలని సీనియర్ కాంగ్రెస్ నేతలు సూచించినట్లు తెలుస్తోంది. మరోవైపు.. పార్టీ నిర్ణయాలపై ఏమైనా అభ్యంతరాలున్నా, ఏవైనా సమస్యలున్నా నేరుగా తనను కలిసి మాట్లాడాలని నేతలకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఒకవేళ అధిష్ఠానానికి చెప్పాలనుకుంటే.. తానే స్వయంగా రాహుల్ గాంధీ అప్పాయింట్ మెంట్ ఇప్పిస్తానని కూడా చెప్పినట్టు తెలుస్తోంది.

### సీక్రెట్ మీటింగులు పెడితే కఠిన చర్యలు..

ఇదే క్రమంలో.. తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జ్ దీప్ దాస్ మున్షీ కూడా నేతలకు వార్నింగ్ ఇచ్చినట్టు తెలుస్తోంది. పార్టీ అంతర్గత విషయాలు బహిరంగ వేదికలపై మాట్లాడితే చర్యలు తప్పవని నేతలకు వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నేతలు తీవ్రంగా విఫలమవుతున్నారంటూ మున్షీ అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని కులగణన, ఎస్సీ వర్గీకరణ తెలంగాణలో చేసినా.. అనుకున్న స్థాయిలో ప్రచారం చేయడం లేదని మున్షీ అసహనం వ్యక్తం చేశారు.

సీఎల్పీ సమావేశం అనంతరం కూడా మీడియాతో మాట్లాడిన మున్షీ.. ఏదైనా సమస్య ఉంటే నాలుగు గోడల మధ్య మాట్లాడుకోవాలని.. ఎమ్మెల్యేలు రహస్య సమావేశాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు. ఎమ్మెల్యేలకు, కార్యకర్తల మధ్య గ్యాప్ ఉందంటూ మున్షీ వ్యాఖ్యానించటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

### ఫిబ్రవరిలో 2 భారీ బహిరంగ సభలు

మరోవైపు.. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ అంశాలపై చర్చించిన సీఎల్పీ.. ఫిబ్రవరిలో రెండు భారీ సభలు పెట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ సభలకు రాహుల్ గాంధీని, మల్లికార్జున ఖర్గేను ఆహ్వానించాలని నిర్ణయించింది.



# తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీస్

మొదటి పేజీ తరువాయి

పార్టీ అగ్ర నాయకత్వం దిశానిర్దేశంతో బీసీలకు సంబంధించి కుల గణన చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ క్రమ శిక్షణా సంఘం జారీ చేసిన నోటీసుల్లో గుర్తు చేసింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ బీసీ కుల గణనపై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం తగదని బీసీల అంశంలో పార్టీ లైన్ దాటి ప్రవర్తించారని గుర్తుచేసింది. 'మీరు కాంగ్రెస్ పార్టీ బీ ఫారంపై వరంగల్–ఖమ్మం–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచిన విషయాన్ని మరచిపోతున్నారు' అంటూ ఒక విధంగా ఆ పార్టీ హెచ్చరించింది. ఆ విషయాన్ని మరచి ప్రవర్తిస్తున్నారని పేర్కొంది. సరైన వివరణ ఇవ్వకపోతే పార్టీ కఠిన చర్యలకు కూడా వెనుకాడదని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ జి.చిన్నారెడ్డి స్పష్టం చేశారు.

ఈ నోటీసుల్లో బీసీ కులగణనను ప్రభుత్వం ఎలా చేపట్టిందో సవివరంగా తీన్మార్ మల్లన్నకు వివరించింది. అలాంటి సర్వేపై విచక్షణా రహితంగా విమర్శలు చేయడమే కాకుండా కుల గణన పత్రాలను దహనం చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఇప్పటికే మంత్రులు, ఓ సామాజిక వర్గం నాయకులు మల్లన్నపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు నాయకులు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేశారు. ఇంకోవైపు కొన్ని సంఘాల నాయకులు మల్లన్నపై పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా ఈ షోకాజ్ నోటీసులపై తీన్మార్ మల్లన్న ఎలా స్పందిస్తారోనని ఆసక్తి నెలకొంది. ఇప్పటికే నోటీసులు ఇచ్చేందుకు వాళ్లెవరు? అని మల్లన్న ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఈ వివాదం మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రేవంత్ పై టాలీవుడ్ తిరుగుబాటేనా?

### గద్దర్ అవార్డుకు పోటీగా ఫిల్మ్ చాంబర్ అవార్డులు

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.ఇకపై ప్రతి సంవత్సరం ఛాంబర్ నుంచి అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 6 తెలుగు సినిమా పుట్టిన రోజు వేడుకల్లోనే అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వం ఇచ్చే అవార్డులతో పాటు ఫిల్మ్ ఛాంబర్ నుంచి అవార్డులు ఉంటాయని తెలిపారు. తెలుగు సినిమా పుట్టినరోజున ప్రతి సినిమా నటుడు తన ఇంటిపై, థియేటర్ల వద్ద ప్రత్యేకంగా జెండా ఆవిష్కరించాలనే కట్టుబాటు పెట్టుకున్నారు. తెలుగు సినిమా పుట్టినరోజు జెండా రూపకల్పన బాధ్యతను పరిచూరి గోపాలకృష్ణకు అప్పగించింది ఫిల్మ్ ఛాంబర్. అయితే ఉగాది రోజున ప్రభుత్వం గద్దర్ అవార్డులు ఇస్తుంటే అంతకు ముందే తాము అవార్డుల వేడుక నిర్వహించుకుంటామని ప్రకటించడం చాలా మందిని ఆశ్చర్య పరుస్తోంది.

ఫిల్మ్ చాంబర్ ఇప్పటి వరకూ ఎలాంటి అవార్డుల కార్యక్రమాలు పెట్టుకోలేదు. హఠాత్తుగా అవార్డులు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అయితే ఈ ఏడాది ఇవ్వడం లేదు. వచ్చే ఏడాది నుంచి ప్రారంభిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు నంది అవార్డులు ఇచ్చేవి. అయితే తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న తర్వాత వాటిని ఇవ్వడం మానేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో ఎలాంటి అవార్డుల ప్రకటన చేయలేదు. సింహ అవార్డులు ఇస్తామని ప్రతిపాదించారు కానీ కార్యాచరణలోకి రాలేదు. ఏపీలో ఓ సారి అవార్డుల్ని ప్రకటించారు. సినిమా ఇండస్ట్రీకి చెందినవారే అవార్డుల ఎంపిక కమిటీలో ఉన్నప్పటికీ ఇండస్ట్రీ వాళ్లే ఆ అవార్డులపై ఆరోపణలు చేయడంతో ప్రభుత్వం అసలు పూర్తిగా పక్కన పెట్టేసింది. సినిమా ఇండస్ట్రీని ప్రోత్సహించడం పనికి మాలిన పని అనుకుంది.

తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. పైగా సినీ పరిశ్రమతో అంత సన్నిహిత సంబంధాలు కొనసాగించలేదు. తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ పేరుతో సినీ అవార్డులు ఇస్తామని చెప్పింది. గద్దర జయంతి రోజున ఇస్తామని చెప్పి టాలీవుడ్ కు కబురు పంపింది. అయితే ఎవరూ ఆసక్తి చూపించలేదు. గద్దర్ పేరుతో ఏదో ఓ అవార్డు అంటే సరే కానీ.. పూర్తిగా నంది పేరు తీసేసి గద్దర్ పేరుతో ఇస్తామనేసరికి టాలీవుడ్ ఆసక్తి చూపించలేదు. ఈ కారణంగా ప్రక్రియ ముందుగా సాగలేదు. ఇటీవల పరిణామాలతో మళ్లీ కదలిక వచ్చింది.

గద్దర జయంతి సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉగాది రోజున గద్దర్ అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఈ అంశంలో టాలీవుడ్ అంత ఆసక్తిగా లేదని స్పష్టమవుతోంది. అయితే ప్రభుత్వ ఒత్తిడి కారణంగా తీసుకోవాల్సిన పరిస్థితులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో గద్దర్ అవార్డుల కంటే ముందే.. ఫిల్మ్ చాంబర్ అవార్డులను ప్రకటిస్తే.. మంచిదన్న అభిప్రాయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. గద్దర అవార్డుల పేరు మార్చాలని కొంత మంది ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నా సానుకూల స్పందన రావడం లేదని అంటున్నారు. అందుకే ఫిల్మ్ చాంబర్ సొంత అవార్డులను ప్రకటించిందన్న అభిప్రాయానికి ఎక్కువ మంది వస్తున్నారు.

# సీఎల్పీ సమావేశానికి పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు డుమ్మా

మొదటి పేజీ తరువాయి

బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ రెండు కూడా చారిత్రాత్మక నిర్ణయాలని.. వాటని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్ ఆదేశించారు. అంరెండు భారీ బహిరంగ సభలు పెట్టాలని నిర్ణయించారు. ఉత్తర తెలంగాణలో బీసీ కులగణన సభ, ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎస్సీ వర్గీకరణ సభలకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సభలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని నిర్ణయం తీసుకున్నారు.

కాగా, ఈ సమావేశానికి పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. సీఎల్పీ సమావేశానికి రావాలని ఆహ్వానం పంపినా.. వారు వెళ్లలేదు. చివరి నిమిషంలో సీఎల్పీ మీటింగ్‌కు గైర్హాజరయ్యారు. ఫిరాయింపుల కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. రెండ్రోజుల క్రితం అసెంబ్లీ కార్యదర్శి వారికి నోటీసులు కూడా జారి చేశారు. ఈ నేపథ్యంలో సీఎల్పీ సమావేశానికి హాజరైతే చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని చివరి నిమిషంలో గైర్హాజరైనట్లు తెలుస్తోంది. ఈ మీటింగ్‌కు అటెండ్ అయితే బీఆర్ఎస్ పార్టీకి ఛాన్స్ ఇచ్చినట్లు అవుతుందని.. ఫిరాయింపులకు పాల్పడినట్లు సుప్రీం కోర్టుకు సంకేతాలు వెళ్తాయనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# స్థానిక సంస్థల ఎన్నికల బాధ్యత ఎమ్మెల్యేలదే - సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించిన రేవంత్ రెడ్డి.. ఇందుకోసం ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో కాంగ్రెస్ బలాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఏకగ్రీవాలు సాధించే బాధ్యత ఎమ్మెల్యేలదేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు నిదర్శనంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, వివిధ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం, నిధుల కేటాయింపు కోసం తక్షణమే సంబంధిత మంత్రులను కలవాలని ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి సూచించారు.

స్థానిక సంస్థల పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండేలా.. బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. బీసీ నాయకత్వాన్ని ముందుకు తీసుకురావడానికి.. వారికి అధికారంలో మద్దతుగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కొత్త, పాత నేతలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీ నేతలు, క్యాడర్ అందరూ ఒకే తాటిపై నిలిచి పనిచేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విజయమే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో మరింత దృఢంగా నిలిచేలా చేస్తుందని, అందుకే ప్రతి నియోజకవర్గం స్థాయిలో సమర్థవంతమైన ఎన్నికల ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ ప్రభుత్వ పథకాలను గట్టిగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

# సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా యూజీసీ కొత్త నిబంధనలు

మొదటి పేజీ తరువాయి

కొత్త నిబంధనల వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు నష్టం జరుగుతుంది. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం అధీనంలోకి తీసుకోవాలనుకుంటున్నారు. యూజీసీ నిబంధనల అభ్యంతరాలపై 6 పేజీలతో నివేదిక ఇచ్చామన్నారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసకోవద్దని విన్నవించామన్నారు. మరోవైపు ఎన్‌హెచ్–365 బి రహదారిని పొడిగించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరామని కేటీఆర్ తెలిపారు.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది ఎమ్మెల్యేల అనర్హత విషయంలో సుప్రీంకోర్టు మొన్ననే నోటీసులు ఇచ్చింది. ఈ నెల 10 మళ్లీ విచారించనున్నది. ఈ విషయంలో మా పార్టీ నాయకుల బృందం న్యాయవాదులను కలుస్తాం. వారిని కలిసి దీన్ని ఇంకా వేగవంతం చేయడానికి ఏ మార్గాలు ఉన్నాయి, పార్టీ మారిన వారిపై ఏ విధంగా వేటు పడాలి చర్చిస్తాం. ఎందుకంటే ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ మూడు కార్యక్రమాల కోసమే ఇక్కడి వచ్చామన్నారు. సాయంత్రం తిరిగి హైదరాబాద్ వెళ్తున్నామన్నారు. తాను మూడు రోజులు ఇక్కడే ఉంటున్నాననే వార్త మీడియాలో చూశానని..అది నాకే తెలవదని సెటైర్ వేశారు.

# 14 నెలలు గడుస్తున్నా..

### కేసీఆర్ మీద ఇంకా రేవంత్ రెడ్డి ఏడుపా?

మొదటి పేజీ తరువాయి

కొంతమంది అనామకులు తామున్నామని చెప్పుకోవడానికే అప్పుడప్పుడు మొరుగుతున్నారని పరోక్షంగా కోమటిరెడ్డి సోదరులకు కౌంటర్ ఇచ్చారు.'కేసీఆర్ చేపట్టిన సర్వేనే కరెక్ట్.. రేవంత్ సర్వే అంతా బోగస్ అని మీ పార్టీ నాయకులే అంటున్నారు. కేసీఆర్ సర్వే అంటే దేశ విదేశాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు' అని సూర్యాపేట బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి పాలన చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. జనాభా తగ్గించి చూపితే మన రాష్ట్రానికి నష్టమనే సోయిలేదా అని నిలదీశారు. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో మరోసారి మోసానికి కాంగ్రెస్ కుట్రలు పన్నిందని ఆరోపించారు. చివరికి ప్రజల్లో తేటతెల్లం అయ్యేసరికి చేతులెత్తేసిందని తెలిపారు.

రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. ఇకనైనా చెంపలేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన మ్యానిఫెస్టో హామీలను పూర్తిగా అమలుచేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్‌పై ఆరోపణలు వదిలేసి అభివృద్ధి, హామీల అమలుపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. 14 నెలలు గడుస్తున్నా కేసీఆర్ మీద ఏడుపు మానుకోవాలని చెప్పారు.

## సచివాలయంలో నకిలీ ఉద్యోగులు

మొదటి పేజీ తరువాయి

తహసీల్దార్ అనే స్టిక్కర్ వాహనంలో గత కొద్దిరోజులుగా సచివాలయంలోకి వస్తున్న అంజయ్యపై అనుమానం రావడంతో ఈ రోజు అంజయ్యను సచివాలయ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం అంజయ్యను సైఫాబాద్ పోలీసులకు అప్పగించి.. అతని పై కేసు నమోదు చేసారు. అంజయ్య వద్ద నుంచి ఫేక్ ఐడీ కార్డును స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. అయితే ఓ జిరాక్స్ సెంటర్ లో ఈ ఫేక్ ఐడి కార్డ్ తయారు చేపించినట్లు పోలీస్ విచారణలో అంజయ్య తెలిపాడు . దీంతో ఈ ఫేక్ ఉద్యోగి దందాల పై పోలీసులు విచారణ మొదలు పెట్టారు.గత బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్ర సచివాలయాన్ని భారీ ఎత్తున నిర్మించారు. గత ప్రభుత్వంలో ఈ సచివాలయంలోకి మంత్రులు, అధికారులకు మినహా ఇతరులకు ఎంట్రీ ఉండకపోయేది. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. సామాన్యులకు సైతం సచివాలయంలోకి వచ్చే అవకాశం కల్పించారు. అయితే ఇటీవల కాలంలో ప్రభుత్వం కల్పించిన ఈ అనుమతిని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా.. నకిలీ ఉద్యోగులను సచివాలయ భద్రతా సిబ్బంది పట్టుకుంటున్నారు.

# సంకెళ్లతో భారత వలసదారులు



అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారత వలసదారులతో అమెరికా అధికారులు అమానవీయంగా వ్యవహరించారంటూ ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒక వీడియో వైరల్ అవుతున్నది. దానిని యూఎస్ అధికారి షేర్ చేశారు. అక్రమవలసదారుల్ని విజయవంతంగా భారత్‌కు తరలించామని పోస్టు పెట్టారు. అమెరికా సరిహద్దు గస్తీ విభాగం చీఫ్ మైఖేల్ డబ్ల్యూ బ్యాంక్స్ ఎక్స్ వేదికగా ఒక వీడియోను షేర్ చేశారు. చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉంటున్న విదేశీయులను విజయవంతంగా తిరిగి పంపించివేశాం. ఇమ్మిగ్రేషన్ చట్టాలను అమలు చేయడంలో అనుసరిస్తున్న నిబద్ధతను ఈ మిషన్ వెల్లడిస్తున్నదని తన పోస్టులో పేర్కొన్నారు. అక్రమంగా సరిహద్దులు దాటితే.. పంపేస్తామంటూ హెచ్చరికలు చేశారు. ఆ వీడియోలో సీ–17 విమానం డోర్ తెరిచి ఉన్నది. కాళ్లకు గొలుసులు కట్టి ఉన్న వలసదారుల వరుసలో నడుస్తూ ఆ విమానం డోర్ వైపు వెళ్లడం కనిపించింది. నేరస్థులను తీసుకెళ్లినట్లుగా వారిని విమానంలోకి తరలించారు. దాని వెనుక సైనికులు ఎక్కారు. మైఖేల్ పోస్టు ప్రకారం .. ఆ భారతీయుల విమానం టెక్సాస్‌లో టేకాఫ్ అయి, అమృత్‌సర్‌లో ల్యాండ్ అయింది.

విపక్షాల విమర్శలపై ఇప్పటికే కేంద్రం స్పందించింది. అమెరికా నుంచి భారత్ వచ్చిన విమానంలో వలసదారుల కాళ్లకు గొలుసులు, చేతికి సంకెళ్లు ఉన్న దృశ్యాలు నిన్న సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై కాంగ్రెస్ నేతలు తీవ్రంగా స్పందించారు. వారిని నేరస్థులుగా పంపడం అవమానకరమని, ఓ భారతీయుడిగా ఇలాంటి దృశ్యాలు చూడలేకపోతున్నానని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా అవేదన వ్యక్తం చేశారు. ఇది చర్చనీయాంశం కావడంతో ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్ డిపార్ట్‌మెంట్ ఆ ఫొటోలపై నిజనిర్ధారణ ప్రక్రియ చేపట్టింది. ఇందులో అవి ఫేక్ అని తేలినట్లు పీఐబీ వెల్లడించింది.

అమెరికాలో అక్రమంగా నివాసముంటున్న 205 మంది భారీతీయులను వెనక్కి పంపారు. టెక్సాస్ నుంచి సీ –17 సైనిక విమానంలో వారిని భారత్‌కు తరలించారు. ఆ విమానం బుధవారం మధ్యాహ్నం అమృత్ సర్‌లో ల్యాండ్ అయ్యింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పాలన పగ్గాలు చేపట్టగానే ఆ దేశంలో అక్రమంగా నివాసం ఉంటున్న వలసదారులపై ఉక్కుపాదం మోపింది. ఈక్రమంలోనే 205 మంది భారతీయులను వెనక్కిపంపింది. అమెరికాలో 20, 407 మంది భారతీయులు అక్రమంగా నివాసముంటున్నారని గుర్తించారు. వారిలో 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్‌వో) కస్టడీలో ఉన్నారు. వారిని మినహా మిగిలిన 17,940 మందిని వెనక్కి పంపేందుకు అమెరికా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం 205 మంది స్వదేశానికి తిరిగి చేరుకోగా మిగిలిన వారిని తర్వలోనే వెనక్కి పంపేయనున్నారు. భారత్‌తో పాటు గటేమాలా, పెరు, హొండూరస్ తదితర దేశాలకు చెందిన అక్రమ వలసదారులను అమెరికా వారి దేశాలకు వెనక్కి పంపేస్తుంది. వీసా గడువు ముగిసిన తర్వాత సరైన పత్రాలు లేకుండా ఇతర దేశాల్లో ఎవరైనా నివాసం ఉండటానికి తాము వ్యతిరేకమని భారత్ ఇదివరకే ప్రకటించింది. అలాంటి వారిని స్వదేశానికి తిరిగి తీసుకువస్తామని విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది.

# సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం ఏర్పాటు




వరంగల్,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):తెలంగాణ రాష్ట్ర సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం హనుమకొండలో రొయ్యల రాజు అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ వి శంకర్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ నైనాలశెట్టి మూర్తి హాజరు కావడం జరిగింది తెలంగాణ రాష్ట్రంలో పార్టీ కర్తవ్యాలను చర్చించడం జరిగింది ఫిబ్రవరి 24 నుండి 26 వరకు ఏఐసిసిటియు కార్మిక సంఘం ఢిల్లీలో జరుగుతున్న జాతీయ మహాసభలు జయప్రదం చేయడానికి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికులను భాగస్వాములను చేస్తూ కార్మిక హక్కులను తిరిగి సాధించడానికి ఆందోళన పోరాటాలు నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి చట్టసభల ద్వారా ఉపాధి భద్రత కనీస వేతనాలు పనిగంటలు ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ ప్రజాస్వామ్యం రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం ఐక్యం ఉద్యమాల గురించి చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శులు రాష్ట్ర కమిటీ సభ్యులు అక్కెనపల్లి యాదగిరి వరంగల్ జిల్లా కార్యదర్శి రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# దేశ సంపదను కార్పొరేట్ లకు దోచిపెట్టే బడ్జెట్

## -సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల దహనం



వరంగల్,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్): భారత పార్లమెంటులో ఇటీవల దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారాం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే విదంగా ఉందని హసన్ పర్తి మండల సీపీఐ (ఎం ) పార్టీ కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు అన్నారు. గురువారం సీపీఐ (ఎం) పార్టీ హసన్ పర్తి మండల కమిటీ ఆధ్వర్యంలో ఎర్రగట్టుగుట్ట వద్ద కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేసి,నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ దేశ జనాభాలో అత్యధికంగా 90 శాతం మంది ప్రజలు దేశ సంపద సృష్టికర్తలైన కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు, రైతులకు బడ్జెట్లో అన్యాయం జరిగిందని అన్నారు.ఈ బడ్జెట్ పేదలపై పన్నులు వేసి అతికొద్ది మంది కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెట్టే బడ్జెట్ అని విమర్శించారు.బడ్జెట్ సమావేశాల్లో సంపద సృష్టికర్తలకు వాటా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేకపోతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు నాంపల్లి మౌనిక,కార్మిక సంఘం నాయకులు అయినాల రామలింగేశ్వర రావు,సీపీఐ(ఎం) నాయకులు శంకర్,సామి,కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్-2025

## క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయి

## స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్





భద్రాద్రి కొత్తగూడెం ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ అయిన హేమచంద్రపురం నందు గల పెరేడ్ మైదానం మరియు క్రీడా మైదానం నందు గురువారం జిల్లా పోలీసుల యాన్యువల్ స్పోర్ట్స్ మీట్–2025 ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా పోలీస్ శాఖలోని విభాగాల వారీగా చేసిన అద్భుతమైన పెరేడ్ ను తిలకించారు.అనంతరం యానిమల్ స్పోర్ట్స్ మీట్ ఫ్లాగ్ ను ఎస్పీ ఆవిష్కరించారు. భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ ముఖ్య అతిథి అయిన ఎస్పీ ని స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించాలని విజ్ఞప్తి చేసిన తర్వాత ఎస్పీ జిల్లా యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించడం జరిగింది.అనంతరం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖలో పనిచేసే పోలీస్ అధికారులు మరియు సిబ్బంది నిత్యం తమ విధులను సమర్ధవంతంగా నిర్వర్తిస్తున్నారని అన్నారు.విధుల నిర్వహణలో భాగంగా నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తున్న పోలీసు అధికారులు,సిబ్బందికి ఆటవిడుపు, మానసికొల్లాసం కొరకు ఈ క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.మూడు రోజుల పాటు జరగనున్న ఈ క్రీడలలో ఆసక్తిగల పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.క్రికెట్,వాలీబాల్,చెస్,క్యారమ్స్,టగ్ ఆఫ్ వార్,కబడ్డీ,షటిల్ బాడ్మింటన్,అథ్లెటిక్స్,5 కిలోమీటర్ల పరుగు పందెం వంటి క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.గెలుపోటములు సహజమని క్రీడాకారులందరూ స్పోర్టింగ్ స్పిరిట్ తో ఆడాలని అన్నారు.పోలీసు అధికారులు మరియు సిబ్బంది తమ తమ శారీరక సామర్థ్యాన్ని పెంచుకోవడానికి మరియు మానసికోల్లాసానికి ఏర్పాటుచేసిన ఈ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ స్పోర్ట్స్ మీట్ పేరెడ్ ఏర్పాట్లను అద్భుతంగా తయారుచేసిన అధికారులను అభినందించారు. అనంతరం ముందుగా హోంగార్డ్స్ టీమ్ మరియు పాల్వంచ సబ్ డివిజన్ మధ్య జరిగిన వాలీబాల్ మ్యాచ్ ను టాస్ వేసి ఎస్పీ ప్రారంభించారు.అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయ టీం మరియు ఇల్లందు సబ్ డివిజన్ టీమ్ ల మధ్య ఉత్కంటభరీతంగా జరిగిన క్రికెట్ మ్యాచ్ ను తిలకించారు

# కెరీర్ గైడెన్స్ పై సంపూర్ణ విశ్లేషణ



భద్రాద్రి కొత్తగూడెం ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోగల రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేడు 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల సిద్ధపాటు. పదో తరగతి ప్రాముఖ్యత– పదవ తరగతి అనంతరం ఉండే సకల చదువులు, ట్రైనింగ్ ల గూర్చి పూర్తి అవగాహన హెచ్ ఎం ప్రభు దయాల్ కల్పించారు. ప్రతి వ్యక్తి విద్యా జీవితంలో పదో తరగతి మొదటి మైలురాయి వంటిది కావున పూర్తి శ్రద్ధ శక్తులతో ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధపడితే మంచి ఫలితాలు వాటంతట అవే వస్తాయన్నారు. తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల దీవెనలతో వారి ఆశలను వమ్ము చేయకుండా ప్రణాళిక బద్ధంగా ఇష్టమయ్యే రీతుల్లో కొద్దికాలం శ్రమిస్తే అద్భుత ఫలితాలను సులభంగా సాధించవచ్చన్నారు. కెరీర్ గైడెన్స్ వివరణను ఫ్లో చార్ట్ ద్వారా విశ్లేషించారు. పాఠశాలలో ప్రత్యేకంగా అందించిన స్టడీ మెటీరియల్, రోజువారి ప్రత్యేక ప్రశ్నలను అర్థం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రభావాలకు, ఆవేశాలకు లోను కాకుండా మనో నిబ్బరంతో స్థిర నిశ్చయంతో చదవాలన్నారు. దీనికై సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. సబ్జెక్టు విషయాల్లో ఏవేని సందేహాలు వస్తే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో తరగతి ఇంచార్జి టీచర్లు, సబ్జెక్టు టీచర్లు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి.

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం రోజున 1 నుండి 19 సంవత్సరాల వయసు గల వారందరికీ నులిపురుగులను నివారించే ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ మరియు గిరిజన ఆశ్రమ పాఠశాలలు మరియు వసతి గృహాలలో ప్రతి విద్యార్థులకు మాత్రలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మాత్రల ద్వారా పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమధ్యం నివారించవచ్చు, చదువుల పట్ల ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. విద్యాశాఖ, ఏఎన్ఎం, అంగన్వాడీలు సమన్వయంగా పనిచేసి జిల్లాలోని విద్యార్థులందరికీ మాత్రలను అందివ్వాలి అన్నారు. ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, అంగన్వాడి పిల్లలకు మాత్రలు అందించాలన్నారు. అంగన్వాడి టీచర్లకు శిక్షణ ఇచ్చి వయసుల వారీగా మాత్రల డోస్ ఇవ్వాలన్నారు. భోజనం తర్వాతనే ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. మాత్రలు వేసే ప్రదేశంలో తగినంత త్రాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.




జిల్లాలో 336,212 మంది ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల వారు ఉన్నారని ఆయన తెలిపారు. వారి అందరికీ మాత్రలు అందించాలని తెలిపారు. ప్రత్యేక షెడ్యూల్ ని ఏర్పరచుకొని నులిపురుగుల నిర్మూలన మాత్రలు అందివ్వాలి అన్నారు. ప్రజలకు అర్బెండజోల్ మాత్రల ఉపయోగాలపై కళా జాతర బృందాలు మరియు మహిళా సమాఖ్యల ద్వారా విస్తృత అవగాహన కల్పించి, పిల్లలందరూ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. 10వ తేదీన మాత్రలు తీసుకొని వారికి 17వ తేదీన మాప్ ఆఫ్ డే నిర్వహించి మాత్రలు అందించాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు అన్ని విద్యార్థులకు మాత్రలు అందేలా చూడాలని, అనంతరం నివేదికలు సమర్పించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నులిపురుగుల నిర్మూలలకు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, డిసిహెచ్ఓ రవిబాబు, మహిళా, శిశు మరియు వయోవృద్ధుల సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి అనసూయ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా అయ్యప్ప ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు...

- అయ్యప్పకు ప్రత్యేక పూజలు
- 108 కళాశాలతో ఘటాభిషేకం
- ఆలయంలో అన్నదానం
- దివ్య పడిపూజ మహోత్సవానికి హాజరైన భక్తులు





కమలాపూర్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): హనుమకొండ జిల్లా, కమలాపూర్ మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి... ఆలయ పూజారి ఇందుర్తి జానకి రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు... ఉదయం గణపతి హెూమం, అష్టోత్తర పూజలు, 108 కళాశాలతో ఘటాభిషేకం నిర్వహించి అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేపట్టారు... మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం నిర్వహించగా, సాయంత్రం దివ్య పడిపూజ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వేదమంత్రోత్సవంల నడుమ అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించి పడిపూజ మహోత్సవాన్ని కొనసాగించారు. పలు రకాల అభిషేకాలు నిర్వహించి అయ్యప్పను పూజించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో భోజనాలు చేసి స్వామిని వేడుకున్నారు... ఈ కార్యక్రమంలో శ్రీ ధర్మశాస్త్ర సేవాసమితి ఆలయ కమిటీ చైర్మన్ నేరెళ్ల అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తవుటం కరుణాకర్, మౌటం కుమారస్వామి, భూపతి శివశంకర్, విద్యాసాగర్, జక్కు కృష్ణమూర్తి, సదాచారి, సమ్మయ్య గౌడ్, సుధాకర్, నంగునూరు సాగర్, చీరాల సాంబయ్య, నాగేందర్, రాజేశం, హరి, నరేందర్ రెడ్డి, చంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు...

# శాంతి భద్రత విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

### హెూటల్, పబ్, ఈవెంట్ ఆర్గనైజర్స్‌కి సూచించిన డీసీపీ వినీత్




శేరిలింగంపల్లి,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):శాంతి భద్రత విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, పోలీసులకు సహకరించాలని మాదాపూర్ డీసీపీ జి.వినీత్ సూచించారు. ఇటీవల ప్రిజం పబ్ లో జరిగిన ఘటనను సందర్భంగా మాదాపూర్ పరిధిలోని హెూటళ్లు, పబ్ లు, ఈవెంట్ మేనేజర్లతో గురువారం డీసీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తరచూ జరిగే అనుకోని సంఘటనల విషయాల్లో అనుమానిత వ్యక్తులు పట్ల హెూటళ్లు, పబ్ లు, ఈవెంట్ మేనేజర్లు అప్రమత్తంగా ఉండటమే కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులు కన్పించినపుడు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీసులు సోదాలు నిర్వహించినపుడు సైతం సహకరించాలని, నేరస్థులకు, అనుమానిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించినట్లైతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సుమారు 200 మంది మేనేజర్లు, యజమానులు హాజరైన సమావేశంలో అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీ శ్రీకాంత్, ఎస్.హెచ్.వో లు క్రిష్ణమోహన్, హబీబుల్లా, రమణ తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ వెంకట్ రాజయ్య గెలిపించండి....



టేకులపల్లి,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):స్కూటో టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ వెంకట రాజయ్యను గెలిపించాలని స్కూటో జేఏసీ జిల్లా కన్వీనర్ టిఆర్ సింగరేణి డిప్యూటీ మేనేజర్ సునీల్ కోరారు. ఈ సందర్భంగా గురువారం ఓ ప్రకటనలో ఆయన తెలిపారు.నల్గొండ వరంగల్ ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా స్కూల్స్ కాలేజెస్ యూనివర్సిటీస్ టీచర్స్ ఆర్గనైజేషన్(స్కూటో) జేఏసీ ప్రకటించిందని, జేఏసీ ప్రతినిధులు జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ మురళి మనోహర్, ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, రాజకీయ జేఏసీ కన్వీనర్ కోల జనార్ధన్ మద్దతుగా రావడం సంతోషంగా ఉందని అన్నారు. సేవ్ కాన్సిట్యూషన్, సేవ్ డెమోక్రసీ, సేవ్ గవర్నమెంట్ ఎడ్యుకేషన్ అనే నినాదంతో ముందుకు వెళుతున్నారాని తెలిపారు. అందులో భాగంగానే నాలుగు దశాబ్దాలుగా విద్యారంగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో విద్యారంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు ఆయన ముందుకు వెళు తునన్నారని అన్నారు. ఉపాధ్యాయునిగా సామాజిక రాజకీయ ఉద్యమకారునిగా రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన ఉద్యమ నేపథ్యం ఉన్న మూడు జిల్లాల ఉపాధ్యాయులకు సుపరిచితుడుగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ వెంకట్ రాజయ్యకు నిలబడి ఒక్క అవకాశం ఇచ్చి టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శాసనమండలికి పంపిస్తే మీ పక్షాన పోరాటం చేస్తూ అనేక సమస్యలపై మండలిలో గళం విప్పుతానని తెలిపారు.

# జిల్లా లో ప్రదాన మంత్రి స్కూల్స్ పర్ రైసింగ్ ఇండియా (పి ఎం ఎస్ ఎచ్ ఆర్ ఐ ) స్కీం క్రింద 30 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగింది,జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.




వికారాబాద్,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):గురువారము వీడియో కాన్ఫరెన్సు హాలు నందు జిల్లా లోని 30 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పీఎం శ్రీ ) స్కీం కింద రెండు విడతలలో కలిపి 30 పాఠశాలలు ఎంపిక కావడం జరిగిందని, ఇందులో (06) ఆదర్శ పాఠశాలలో (02) కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, (02) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, (02) గురుకుల పాఠశాలలు అదేవిదంగా (18) ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఎంపిక కాబడిన ప్రతి పాఠశాలలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ప్రతి పాఠశాల యొక్క కనీస అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల యొక్క కనీస అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ పీఎం శ్రీ స్కీం కింద వచ్చిన నిధులను సరిగ్గా వినియోగించుకోవాలని, ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకొని తదుపరి జరగబోయే సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.




ఈ సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా లో వసతి గృహాలలో చేపట్టిన పనులపై మరియు పాఠశాలకు మంజూరు అయిన నిధులను ఏ విధంగా వినియోగించుకోవాలో ప్రతి అంశాన్ని క్లుప్తంగా వివరించారు.

ఈ సమావేశములో జిల్లా విద్యా శాఖాదికారి రేణుక దేవి, ప్రదానోపద్యాయులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## సమస్య పరిష్కారం అయేదెప్పుడు - కాలువ కట్టేది ఎప్పుడు

### అధికారులకు పిర్యాదు చేసినా ఫలితం శూన్యం

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): రామవరం 7 వ వార్డ్ లో సైడ్ కాలువలు నిర్మిస్తున్నారు.ఒకే ఒక కొలతతో రెండు పక్కల కాల్వలు నిర్మించేందుకు తవ్వకాలు జరిపారు.ఒక పక్క కాలువను నిర్మించేశారు.మరో పక్క మాత్రం ఎవరి కోసమో ముందు కొంచెం రోడ్ నీ వదిలేసి కాలువను నిర్మిస్తున్నారు.ఒక వ్యాపారి ఇంటికి అనుకూలంగా కాలువను వంకర టింకరగా నిబంధనలకు విరుద్ధంగా కడుతున్నారు అని స్థానికులు అధికారులకు పలుమార్లు పిర్యాదు చేశారు.సమస్యను త్వరగా పరిష్కరించాల్సిన అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడం పలు అనుమాలకు తావిస్తుంది. కాలువలు సగం తీసి వదిలేయడం వల్ల,ఇంటిలోని వారు బయటకి, లోపటికి వెళ్ళడానికి ఇబ్బందులకు గురి అవుతున్నారు.కనీసం మంచి నీరు కూడా పట్టుకోవడానికి వీలు లేకుండా పోయిందనీ ఒక్కరి కోసం ఇంతమందిని ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుంది అని స్థానికులు వాపోతున్నారు. అధికారులు త్వరగా స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి అని స్థానికులు కోరుతున్నారు.



దర్జాగా కాలువల ఆక్రమణలు...అడ్డుకునే వారు లేరు.?


రామవరం లో కొన్ని సంవత్సరాల క్రితం షాప్ ల ముందు నుండి కాలువలు నిర్మించారు. వ్యాపారస్తులు వారి సౌలభ్యం కోసం కాలువల పైన పలకలు వేయడంతో పాటు రహదారిని కూడా ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగి స్తుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మరోపక్క కాలువలను ఆక్రమించుకోవడంతో వాటి గుండా పోవాల్సిన నీరు వెల్లకుండ ఎక్కడికక్కడ మురుగు పేరుకు పోతుంది.మున్సిపాలిటీ వాళ్ళు శుభ్రం చేయడానికి కూడా అవకాశం లేకుండా పోయింది.ఇంత జరుగుతున్నా అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. అలాంటప్పుడు కొన్ని లక్షల ఖర్చుతో కాలువల నిర్మాణం చేయడం ఎందుకు అని ప్రజలు అనుకుంటున్నారు.

ఇప్పటికీ అయినా సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

# పోలీస్ శాఖలో ఏఆర్ ఎస్ఐ ఆత్మహత్య

పినపాక,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలంలోని ఏడూళ్ళ బయ్యారం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ ఎస్ఐ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న %u+ఙా%-15వ బెటాలియన్ ఏఆర్ ఎస్ఐ సువర్ణపాక లక్ష్మీనర్సు(36) గురువారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రాలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం ఆయన ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని తెలుస్తోంది. లక్ష్మీనర్సు మృతి పట్ల ఏడూళ్ళ బయ్యారం పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



## 2024-25 రబీ ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని, అధికారులకు తెలిపిన జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్.




వికారాబాద్,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): సోమవారం రబీ 2024-25 ధాన్యం సేకరణ కార్యచరణ ప్రణాళిక, 2023-24 సిఎంఆర్ డెలివరీ,రేషన్ కార్డులు, మిల్లర్ల అసోసియేషన్ల బ్యాంకు గ్యారంటీ పత్రాల సమర్పణ తదితర అంశాలపై పౌరసరఫరాల ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ ఉన్నత అధికార తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ,

2024-25 రబీ సీజన్ లో 2,25,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా వుందని, లక్ష టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. 2023-24 ఖరీఫ్ సీఎంఆర్ వంద శాతం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు గోదాములలో ధాన్యం నిలువలను పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. రైస్ మిల్లర్ల నుండి బ్యాంక్ గ్యారంటీ పత్రాలను తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న బియ్యం దుర్వినియోగం కాకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన తెలిపారు.




కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి తో పాటు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మాదిగ మాదిగ ఉపకులాల పక్షాన సీఎం రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.....




హాసన్ పర్తి,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): హాసన్ పర్తి ఎస్సిసెల్ మండలాధ్యక్షులు రామంచ దయాకర్ ఆధ్వర్యంలో హాసన్ పర్తి బస్టాండ్ ఆవరణంలో అంబేద్కర్ కు పూలమాలవేసి అసెంబ్లీ. శాసనమండలిలో షెడ్యూల్ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంతోపాటు షెడ్యూల్ కులాలను ఏ.బీ.సీ. డి కేటగిరీలుగా రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మాదిగ మాదిగ ఉపకులాల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హాసన్ పర్తి మండల కేంద్రంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రామచ దయాకర్ మాట్లాడుతూ

బి.ఆర్ అంబేద్కర్ గారు అందించిన రాజ్యాంగఫలాలు, రిజర్వేషన్లు జనాభా దామాషా ప్రకారం అమలు కావాలని అన్ని వర్గాలకు అందాలని గత 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దండోరా ఉద్యమం జరిగిందని తెలిపారు.

. గత 30 సంవత్సరాలుగా అన్ని ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలిపినా కొన్ని న్యాయపరమైన సమస్యల వల్ల వర్గీకరణ కాలేదని వెల్లడించారు.

2024 ఆగస్టు ఒకటో తేదీన సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని, ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మశానం రాజ్యాంగానికి లోబడి వర్గీకరణ చేపట్టవచ్చని వెల్లడించిందని తెలిపారు. తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్పందించి కేబినెట్ సబ్ కమిటీని వేసి, దీనిపై ప్రజాభిప్రాయాన్ని సేకరించడానికి ఏకసభ్య కమిషన్ వేశారని అన్నారు. ఏకసభ్య కమిషన్ కేబినెట్ సబ్ కమిటీకి అందజేసిన నివేదికను సబ్ కమిటీ ఆమోదించి నిన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టడం జరిగిందని పేర్కొన్నారు. అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించడమే కాకుండా ఎస్సీ వర్గీకరణకు పూర్తి మద్దతు తెలిపారని అన్నారు.

ఆనందం వ్యక్తం చేశారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ ఎవరికి వ్యతిరేకం కాదని, షెడ్యూల్ కులాల్లో ఉన్న అందరం కూడా అన్నదమ్ములమేనని స్పష్టం చేశారు. షెడ్యూల్ కులాలలో ఉన్న అసమానతులను సరిచేయడమే వర్గీకరణ యొక్క ముఖ్య ఉద్దేశమని వివరించారు.

అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే షెడ్యూల్ కులాలకు 18 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించారని కాబట్టి జనాభా ప్రాతిపదికన తక్షణమే షెడ్యూల్ కులాల రిజర్వేషన్లను 15% నుండి 18 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇది మాకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఎవరో బిక్ష పెట్టాల్సిన అవసరం మాకు లేదని స్పష్టం చేశారు.

. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాని సమయంలో మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ముందుకు వచ్చి వర్గీకరణను అమలు చేసే ప్రణాళికను రూపొందించడం సంతోషించదగిన విషయమని తెలిపారు. . ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దండోరా ఉద్యమానికి నాయకత్వం వహించిన మందకృష్ణ మాదిగ గారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు. యూత్ నాయకులు. సోషల్ మీడియా.స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో చేపట్టిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయ్యాలి,జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.




వికారాబాద్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): గురువారము వీడియో కాన్ఫరెన్సు హాలు నందు పంచాయతి రాజ్, ఆర్ అండ్ బి,మున్సిపల్ కార్పోరేషన్ అధికారులతో ఏర్పటు చేసిన సమావేశము లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో నాలుగు నియోజకవర్గాలలో రెండు పడకల గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇప్పటి వరకు జిల్లా లో 851 ఇండ్లు పూర్తి అయినవని, మిగతా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తే పేదవారికి ఇండ్లు అందుబాటులోకి వస్తాయని , ఇండ్లకు నివాసయోగంగా ఉండేందుకు అవసరమైన వాటర్ సప్లయ్,రోడ్లు , డ్రైనేజీ ,విద్యుత్, తదితర మౌళిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని శాఖ ల సమన్వయంతో ముందుకెల్లాలని సూచించారు.ఈ సందర్భంగా నియోజకవర్గం వారిగా ఎక్కడ ఏ ఏ పనులు పూర్తి అయ్యా యి , ఇంకా ఎన్ని పురోగతిలో ఉన్నవి , పూర్తి కావలసినవి ఇంకా ఎన్ని ఉన్నాయని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతి రాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, మున్సిపల్ కార్పోరేషన్ వారి అధ్వర్యంలో చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలనీ, నిర్మాణంలో ఉనటువంటి ఇండ్ల పనులను వివిధ శాఖల సమన్వయంతో పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు.

ఈ సమావేశములో జిల్లా అదనపు కలెక్టర్ (స్తానిక సమస్తలు) సుదీర్, డి ఆర్ డి ఎ శ్రీనివాస్, ప్రాజెక్ట్ డైరెక్టర్ హౌసింగ్ కృష్ణయ్య, పంచాయతి రాజ్ ఈ ఈ ఉమేష్, ఆర్ డబ్ల్యు ఎస్ ఈ ఈ శ్రవణ్ ప్రకాష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం బీసీలను అణచివేసేందుకు కుట్రలు

### గౌడుల జనాభాను తక్కువ చూపడం సరికాదు

### స్పష్టమైన జనాభా లెక్కలు చూపాలి

### తెలంగాణ గౌడ సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు తోటకూరి శ్రీకాంత్ గౌడ్



ములుగు జిల్లా ప్రతినిధి,06ఫిబ్రవరి (పబ్లిక్ న్యూస్):తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గౌడ కుటుంబాలు ఎక్కువగానే ఉన్నాయని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తోటకూర శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను అణచి వేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. గౌడన్నలు వారి కుటుంబ సభ్యులు ప్రతి నియోజకవర్గంలో 20వేల నుంచి 30వేల వరకు ఉంటారని అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తక్కువ చేసి చూపడం ఎంత వరకు సమంజనమని ప్రశ్నించారు. ఇలాంటి తప్పుడు సమాచారాలతో బీసీలను దర్కాల్సిన వాటాలను అగ్రవర్ణాలకు దోచిపెట్టడమేనని విరుచుకుపడ్డారు. ఉన్నది ఉన్నట్లుగా చూపడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు . తప్పుడు లెక్కలు చూపి బీసీలను మోసం చేయడం సరివాడున్నారు. తెలంగాణలో గౌడుల జనాభా మీరు చూయించింది 16 లక్షలు గత ప్రభుత్వం చూపించిన దాంట్లో 20 లక్షలు అంటే పది సంవత్సరాలు గడిచిన తర్వాత మా గౌడుల జనాభా ఏమాత్రం పెరగలేదా అని మండిపడ్డారు. సమగ్ర కుటుంబ సర్వేతో బీసీలకు న్యాయం జరుగుతుందని బీసీలు ఊహించారు. అనుకున్నదొకటి.. అయిందొక్కటి. బీసీలకు విద్య, ఉద్యోగావకాశాలను దెబ్బతీసేందుకే ఇలా చేశారు. బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి వారికి లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చూపిస్తామని శ్రీకాంత్ గౌడ్ అన్నారు

## బీసీ సంఘం పెద్దేముల్ అధ్యక్షురాలుగా కుర్వ శివలీల కు, నియామకపత్రం అందించిన జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్ కుమార్.




వికారాబాద్,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):బీసీల ఉద్యమంలో మహిళల పాత్ర కీలకం కావాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ అన్నారు. గురువారం బీసీ సంఘం పెద్దేముల్ మండల అధ్యక్షురాలుగా రుక్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ శివలీలను నియమించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ తో పాటు జిల్లా అధ్యక్షురాలు మధులత శ్రీనివాస్ చారీలు శివలీలకు నియామకపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో బీసీలు పటిష్టంగా ఉండడం ఎంతో అవసరమన్నారు. బీసీల హక్కుల సాధనకు సాగిస్తున్న ఉద్యమంలో మహిళలు కూడా కీలకంగా నిలవాలన్నారు.

బీసీ సంఘం నుంచి పెద్దేముల్ మండల అధ్యక్షురాలుగా నియామకమైన శివలీల బీసీ మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ప్రతి గ్రామాల్లో కమిటీలను నియమించాలన్నారు. అదేవిధంగా అధ్యక్షురాలుగా నియామకమైన శివలీల మాట్లాడుతూ తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్షురాలుగా ఎన్నుకోవడం పట్ల జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య, రాజ్ కుమార్ లకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ షకూర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, పెద్దేముల్ మండల అధ్యక్షులు శ్రావణ్ కుమార్, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు అనిత, బషీరాబాద్ మండల అధ్యక్షురాలు వీరమణి, లక్ష్మీ, నర్సమ్మ, మంజుల, విజయలక్ష్మీ, పోషల్ మీడియా ఇంచార్జ్ బస్వరాజ్, జుంటుపల్లి వెంకట్, కుర్వ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ఈ క్యాన్సర్ ను గుర్తించడం ఎలా..?

హెల్త్ న్యూస్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):బ్రిటన్ లో అన్నవాహిక క్యాన్సర్ కేసులు చాలా ఎక్కువగా ఉన్నాయని తాజా విశ్లేషణలో తేలింది. ఈ వ్యాధి అన్నవాహికను (నోటిని కడుపుతో కలిపే గొట్టం) ప్రభావితం చేస్తుంది. ఇది చాలా ప్రమాదకరమైన క్యాన్సర్. ఈ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. అన్నవాహిక క్యాన్సర్ కి సంబంధించిన కొన్ని సంకేతాలు తినేటప్పుడు కనిపిస్తాయి. వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



అన్నవాహిక క్యాన్సర్ లక్షణాలు.. బ్రిటన్ కు చెందిన NHS సంస్థ అన్నవాహిక క్యాన్సర్ కి సంబంధించిన కొన్ని లక్షణాలను పేర్కొంది. వీటిలో ఆరు లక్షణాలు తినేటప్పుడు కనిపిస్తాయట.

మింగడంలో ఇబ్బంది (డిస్ఫాగియా)

వికారం లేదా వాంతులు

గుండెల్లో మంట లేదా యాసిడ్ రిఫ్లక్స్

అజీర్ణం, ఎక్కువగా త్రేనుపులు రావడం

ఆకలి లేకపోవడం లేదా బరువు తగ్గడం

గొంతులో లేదా ఛాతీ మధ్యలో నొప్పి.. ముఖ్యంగా మింగేటప్పుడు

గుండెల్లో మంట అన్నవాహిక క్యాన్సర్ సాధారణ లక్షణాలలో ఒకటి. ప్రతిరోజు గుండెల్లో మంట వస్తుంటే లేదా మంటను తగ్గించడానికి మందులు వాడుతున్నా తగ్గకపోతే డాక్టర్‌ను కలవడం చాలా ముఖ్యం. డాక్టర్ షెరాజ్ మార్కర్ మాట్లాడుతూ.. నిరంతర యాసిడ్ రిఫ్లక్స్ లేదా గుండెల్లో మంట అలాగే బారెట్ అన్నవాహిక ( కడుపులోని ఆమ్లం అన్నవాహిక లైనింగ్‌ను దెబ్బతీసినప్పుడు కణాలు పాడైపోవడం) అన్నవాహిక క్యాన్సర్‌కు ప్రధాన ప్రమాద కారకాలు.

బ్రిటన్ లో అన్నవాహిక క్యాన్సర్ తరచుగా వ్యాప్తి చెందిన తర్వాత కనుగొనబడుతుంది. దీని వలన చికిత్స చేయడం కష్టం అవుతుంది. అయితే రోగికి ఈ కాన్సర్ సోకిన ప్రారంభ రోజుల్లో కనుక గుర్తిస్తే మంచి చికిత్స ఎంపికలు ఉన్నాయి. గుండెల్లో మంటతో పాటు మింగడంలో ఇబ్బంది, కారణం లేని బరువు తగ్గడం, నిరంతర అజీర్ణం, వికారం లేదా వాంతులు వంటి లక్షణాలను గమనించాలి అని తెలిపారు.

**అన్నవాహిక క్యాన్సర్ ఇతర లక్షణాలు**

దగ్గు తగ్గకపోవడం

గొంతు బొంగురుపోవడం

నీరసం లేదా శక్తి లేకపోవడం

నల్లటి మలం లేదా రక్తం దగ్గడం

ఈ లక్షణాలు క్యాన్సర్ వల్లనే వస్తాయని ఖచ్చితంగా చెప్పలేం. కానీ అవి నిరంతరం ఉంటే లేదా తీవ్రంగా ఉంటే వాటిని పరీక్షించడం మంచిది. ఈ సమాచారం ప్రజలకు అన్నవాహిక క్యాన్సర్ పట్ల అవగాహన పెంచడానికి.. లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవడానికి ఉపయోగపడుతుంది.

# పిస్తాతో పుట్టెడు లాభాలు..

## మీ ఆహారంలో వీటిని తీసుకుంటున్నారా?



హెల్త్ న్యూస్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ) కొన్ని ఆహారాలు వాతావరణాన్ని బట్టి మన శరీరానికి మేలు చేస్తాయి. ఈ ఆహారాలు మన రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. అటువంటి వాటిల్లో పిస్తాపప్పు ఒకటి. పిస్తాపప్పు శీతాకాలంలో శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. :పిస్తాపప్పులో జింక్ అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడే ప్రతిరోధకాలను ఉత్పత్తి చేయడానికి ఉపయోగపడుతుంది. ఇందులోని విటమిన్ బి6 రోగనిరోధక పనితీరుకు అవసరమైన ప్రతిరోధకాలను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. అలాగే ఇందులోని సెలీనియం యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది..

పిస్తాపప్పులోని జింక్ వైరల్ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని, తీవ్రతను తగ్గిస్తుంది. వైద్యుల అభిప్రాయం ప్రకారం పిస్తాపప్పు సంతృప్తికరమైన, ఆరోగ్యకరమైన ఆహారం. ఇది మన శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది. పిస్తాపప్పులో AMD.. కంటిశుక్లాలు, కళ్ళపై ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగపడుతుంది. కంటి దృష్టిని కాపాడుతుంది.

పిస్తాపప్పులోని పాలీఫెనాల్స్, కెరోటినాయిడ్లు రోగనిరోధక కణాల కార్యకలాపాలను పెంచుతుంది. ఇందులోని ప్రీబయోటిక్ లక్షణాలు పేగులోని బ్యాక్టీరియాను పోషిస్తుంది. ఇది శ్లేష్మ పొర రోగనిరోధక వ్యవస్థను నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

ఇన్ని రకాలుగా ఉపయోగపడే పిస్తాపప్పును మీ ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకోవడం చాలా అవసరం. పిస్తాపప్పులోని పోషక విలువలు ఆరోగ్యాన్ని కాపాడటంతోపాటు అవసరమైన పోషకాలను అందిస్తాయి. దీనిని సలాడ్లు, ఇతర డెజర్ట్‌లలో కూడా వేసుకోవచ్చు.

# పేగు ఇన్ఫెక్షన్ అయితే కనిపించే లక్షణాలివే, నిర్లక్ష్యం చేయకండి

హెల్త్ న్యూస్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):ఆరోగ్యమే మహాభాగ్యం. ఆరోగ్యంగా ఉండాలంటే గట్ హెల్త్ ఎంతో కీలకం. మనం తినే ఆహారాన్ని జీర్ణం చేయడంతో పాటు శరీరానికి అవసరమైన పోషకాలన్ని అందిస్తుంది గట్. అంతేకాకుండా వ్యర్థ మలిన పదార్థాల్ని కూడా బయటకు పంపిచేస్తుంది. పేగులు ఆరోగ్యంగానే ఉంటేనే ఓ వ్యక్తి ఎలాంటి సమస్య లేకుండా ఉంటాడు. పేగులు అనారోగ్యంగా ఉంటే జీర్ణక్రియ సమస్యలు ఎదురయ్యే ప్రమాదముంది. దీంతో కడుపు సమస్యలతో పాటు ఇమ్యూనిటీ పవర్ కూడా తగ్గుతుంది.



ముఖ్యంగా చాలా మది పేగు ఇన్ఫెక్షన్‌కు గురవుతారు. పేగు ఇన్ఫెక్షన్ సమయంలో చాలా మంది మంట, వాపుతో బాధపడతారు. ఈ పరిస్థితి ప్రధానంగా బ్యాక్టీరియా, వైరస్, ఇతర సూక్ష్మక్రిముల కారణంగా సంభవించవచ్చు. పేగు సంబంధిత ఇన్ఫెక్షన్ కారణంగా.. చాలా సమస్యలు వస్తాయి. అందుకే పేగు ఇన్ఫెక్షన్ లక్షణాలు కనిపించిన వెంటనే అలర్ట్ అవ్వాలి. లేదంటే ఆరోగ్యానికి ముప్పు కలుగుతుంది. పేగు సంబంధిత ఇన్ఫెక్షన్ వచ్చే ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. ఆ లక్షణాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.

**అతిసారం..**

ఒక్క రోజులో 3 లేదా అంతకంటే ఎక్కువగా లూజ్ మోషన్స్ అవుతుంటే.. జాగ్రత్తగా ఉండాలి. ఈ పరిస్థితిని డయేరియా అంటారు. అయితే, విరేచనాల సమస్య ఉన్నవారికి రోజుకు రెండు సార్లు మాత్రమే లూజ్ మోషన్స్ అవుతాయి. ఈ సమస్య అనేక కారణాల వల్ల రావచ్చు. అయితే, పేగు ఇన్ఫెక్షన్ అయితే మాత్రం విరేచనాలు చాలా లూజ్‌గా అవుతుంటాయి. మలంలో రక్తం, జిగట వంటి లక్షణాలు కనిపిస్తే అది పేగు ఇన్ఫెక్షన్‌కు సంకేతం. ఒకే రోజు మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు లూజ్ మోషన్స్ అయితే.. వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి.

**మలబద్ధకం..**

పేగు ఇన్ఫెక్షన్ అయితే.. చాలా మంది మలబద్ధకంతో బాధపడతారు. మలం కూర్చొనే సమయంలో తీవ్ర నొప్పి రావడం.. సరిగ్గా మలవిసర్జన చేయకపోవడం మలబద్ధక లక్షణాలు. మలబద్ధకంతో పాటు కడుపు తిమ్మిరి, వికారం, వాంతులు, జ్వరం, తలనొప్పి, అలసట, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కూడా పేగు ఇన్ఫెక్షన్‌లో కనిపిస్తాయి. పేగు కదిలికలో ఇబ్బందిని ఎదుర్కొంటుంటే.. వెంటనే వైద్యుణ్ని సంప్రదించండి. దీంతో.. మీ సమస్యకు పరిష్కారం లభించవచ్చు.

**కారణం లేకుండా కడుపు నొప్పి..**


సాధారణంగా ఆహారం జీర్ణమవ్వకపోవడం, గ్యాస్ సమస్యల వల్ల కడుపు నొప్పి వస్తుంది. ఈ సమస్య తేలికపాటి లక్షణాలతో ఉంటుంది. అయితే, పేగు ఇన్ఫెక్షన్ ఉంటే మాత్రం రోగులు ఎటువంటి కారణం లేకుండా కడుపులో నొప్పి వస్తుంది. ఈ నొప్పి కూడా చాలా తీవ్రంగా ఉంటుంది. కడుపు నొప్పి తీవ్రంగా ఉంటే వెంటనే డాక్టర్‌ని సంప్రదించడం మేలు అంటున్నారు నిపుణులు. పేగు ఇన్ఫెక్షన్ అప్పుడు తీవ్రమైన కడుపు నొప్పి రెండు వారాల కంటే ఎక్కువ ఉంటుంది.

**వాంతులు..**

పేగు ఇన్ఫెక్షన్ సమయంలో తరుచుగా వాంతులు అవుతుంటాయి. అంతేకాకుండా జ్వరం, చలి,స వికారం, తిమ్మిరి, మలంలో రక్తం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. వాంతులు ఎంత సేపటికి ఆగకపోతే.. పేగు ఆరోగ్యం సరిగ్గా లేదని అర్థం చేసుకోండి. ఈ సంకేతాలు కనిపిస్తే వెంటనే డాక్టర్ సహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**వికారం..**

వికారం, వాంతులవ్వడం గట్ ఇన్ఫెక్షన్ సాధారణ లక్షణాలు. ఈ లక్షణాలు తరుచుగా కలిసి వస్తాయి. ఎందుకంటే ఇన్ఫెక్షన్ వల్ల కడుపులో ఎక్కువ యాసిడ్ ఉత్పత్తి అవుతుంది. దీంతో... జీర్ణక్రియ మందగించవచ్చు. ఆహారం తక్కువగా జీర్ణమవుతుంది. దీంతో.. వికారం, పుల్లటి తేన్పులు, వాంతులు వంటి సమస్యలు రావచ్చు. అందుకే ఈ సంకేతాలు కనిపించిన వెంటనే అలర్ట్ అవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.





# తొలి వన్డేలో భారత్ విజయం



స్పోర్ట్స్ న్యూస్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ 4-1తో కైవసం చేసుకున్న భారత జట్టు.. వన్డే సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. గురువారం నాగ్‌పూర్ వేదికగా జరిగిన తొలి వన్డేలో 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. 47.4 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం భారత్ 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ కెప్టెన్ బట్లర్.. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే కెప్టెన్ నమ్మకాన్ని నిజం చేస్తూ.. ఆ జట్టు ఓపెనర్లు మెరుపు ఆరంభం ఇచ్చారు. వన్డేల్లో టీ20 తరహాలో బ్యాటింగ్ చేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో ఓ దశలో ఇంగ్లాండ్.. 8.4 ఓవర్లలో 75/0తో నిలిచింది. దీంతో ఈ మ్యాచ్‌లో భారీ స్కోరు నమోదవుతుందని అంతా భావించారు.
ఈ దశలో శ్రేయస్ అయ్యర్ చేసిన అద్భుతమైన ఫీల్డింగ్‌కు ఫిల్ సాల్ట్ (26 బంతుల్లో 43 రన్స్) రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత బౌలర్లు పుంజుకోవడంతో ఇంగ్లాండ్ వరుసగా వికెట్లు కోల్పోయింది. దీంతో 111 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అయితే జోస్ బట్లర్ (52), జాకబ్ బెథెల్ (51) రాణించడంతో చివరకు ఇంగ్లాండ్.. 248 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 3 వికెట్లు, రవీంద్ర జడేజా 3 వికెట్లు, మహమ్మద్ షమీ 1, అక్షర్ పటేల్ 1, కుల్‌దీప్ యాదవ్ ఒక వికెట్ తీశారు.
అనంతరం 249 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్..38.4 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (2) మరోసారి విఫలమయ్యాడు. శుభ్‌మన్ గిల్ (87), శ్రేయస్ అయ్యర్ (59), అక్షర్ పటేల్ (52) రాణించారు. ఈ మ్యాచ్ ఫలితంతో భారత్ సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రెండో వన్డే.. కటక్ వేదికగా ఆదివారం జరగనుంది.

# రషీద్ ఖాన్ అరుదైన రికార్డు..

## టీ20 క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా గుర్తింపు

స్పోర్ట్స్ న్యూస్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): అఫ్ఘానిస్థాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ రషీద్ ఖాన్.. ప్రపంచ క్రికెట్‌లో చరిత్ర సృష్టించాడు. టీ20 క్రికెట్‌లో ఎవరికీ సాధ్యం కాని రికార్డును క్రియేట్ చేశాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక



వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో జరుగుతున్న సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో ఎంఐ కేప్‌టౌన్ తరపున ఆడుతున్న ఈ ప్లేయర్.. పార్ల్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ రికార్డు సాధించాడు. ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసి.. టీ20 క్రికెట్‌లో తన వికెట్ల సంఖ్యను 633కి పెంచుకున్నాడు
రషీద్ ఖాన్ కంటే ఈ ముందు ఈ రికార్డు వెస్టిండీస్ ప్లేయర్ డ్వేన్ బ్రావో పేరిట ఉంది. అతడు 582 మ్యాచ్‌లలో 24.40 సగటుతో 631 వికెట్లు తీశాడు. తాజాగా అతడిని రషీద్ అధిగమించాడు. రషీద్ 461 మ్యాచ్‌లలోనే ఈ ఫీట్ సాధించాడు. 18.08 సగటుతో ఈ వికెట్లు తీశాడు. ఇందులో అఫ్ఘానిస్థాన్ జట్టు తరపున 161 వికెట్లు పడగొట్టాడు. మిగిలిన వికెట్లు.. దేశవాళీ క్రికెట్‌తో పాటు వివిధ లీగుల్లో పడగొట్టాడు.
కాగా టీ20 క్రికెట్‌లో రషీద్ ఖాన్ బెస్ట్.. 6/17గా ఉంది. నాలుగు సార్లు ఫైవ్ వికెట్ హాల్ దక్కించుకున్నాడు. డ్వేన్ బ్రావో బెస్ట్ 5/గా ఉంది. అందులో మూడు సార్లు ఫైవ్ వికెట్ హాల్ కైవసం చేసుకున్నాడు. డ్వేన్ బ్రావో రికార్డును అధిగమించడం పట్ల.. రషీద్ స్పందించాడు. "నిజానికి పదేళ్ల ముందు వరకు ఈ ఫీట్ సాధిస్తానని కలలో కూడా అనుకోలేదు. సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో టేబుల్ టాపర్‌గా నిలిచినందుకు సంతోషంగా ఉంది. డ్వేన్ బ్రావో టీ20లలో అత్యుత్తమ బౌలర్. అతడిని అధిగమించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. భవిష్యత్‌లో కూడా ఇదే ప్రదర్శన కంటిన్యూ చేసేందుకు ప్రయత్నిస్తా" అని రషీద్ వ్యాఖ్యానించాడు.
టీ20లలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు వీరే..
రషీద్ ఖాన్- 633 వికెట్లు
డ్వేన్ బ్రావో- 631 వికెట్లు
సునీల్ నరైన్- 574 వికెట్లు
ఇమ్రాన్ తాహిర్- 531 వికెట్లు
షకిబ్ అల్ హసన్- 492 వికెట్లు
ఆండ్రీ రస్సెల్- 466 వికెట్లు
ఇక SA20లో ఎంఐ కేప్‌టౌన్ జట్టు ఫైనల్ చేరింది. క్వాలిఫయర్-1లో పార్ల్ రాయల్స్‌ను 39 పరుగుల తేడాతో ఓడించి.. ఈ ఘనత సాధించింది. ఫిబ్రవరి 8న ఈ టోర్నీలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

# ఏడాది క్రితం చేసిన పనికి ఆ బౌలర్ కు షాక్ ఇచ్చిన ఐసీసీ

స్పోర్ట్స్ న్యూస్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఐర్లాండ్‌కు చెందిన యువ స్పిన్నర్ ఐమీ మాగ్వైర్‌పై అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ నిషేధం విధించబడింది. ఆమె బౌలింగ్ యాక్షన్ చట్టవిరుద్ధమని స్వతంత్ర అంచనా నిర్ధారించిన తర్వాత, మాగ్వైర్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తక్షణమే సస్పెండ్ చేసింది. ఈ నిర్ణయం 2023, జనవరి 10న భారతదేశంలో రాజ్‌కోట్‌లో జరిగిన ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్‌షిప్ సిరీస్ తొలి వన్డేలో 18 ఏళ్ల మాగ్వైర్ ఆటతీరు అనుమానాస్పదంగా ఉన్నప్పుడు తీసుకోబడింది. ఈ నేపథ్యంలో, మ్యాచ్ అధికారులు ముందుగా ఫిర్యాదు చేశారు. తరువాత, 2023 జనవరి 21న మాగ్వైర్ ఐసీసీ గుర్తింపు పొందిన పరీక్షా కేంద్రంలో తన బౌలింగ్ యాక్షన్‌కు సంబంధించిన అంచనాను ఇచ్చారు. అంచనంలో ఆమె మోచేయి పొడిగింపు ICC యొక్క అక్రమ బౌలింగ్ నిబంధనల ప్రకారం 15-డిగ్రీల పరిమితిని మించిపోవడం నిర్ధారితమైంది.

దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనలో, "నిబంధనలలోని 6.1 ప్రకారం, ఐమీని అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ చేయకుండా వెంటనే సస్పెండ్ చేశారు. ఆమె బౌలింగ్ యాక్షన్‌ను తిరిగి అంచనా వేసే వరకు ఈ సస్పెన్షన్ అమలులో ఉంటుంది" అని ఐసీసీ వెల్లడించింది. ఈ నిర్ణయంతో పాటు, ఐర్లాండ్ క్రికెట్ సంస్థ మాగ్వైర్‌కు తన మద్దతును



పునరుద్ఘాటించింది. క్రికెట్ ఐర్లాండ్ హై-పెర్ఫార్మెన్స్ డైరెక్టర్ గ్రేమ్ వెస్ట్ మాగ్వైర్‌కు సహకారాన్ని అందిస్తున్నామని, ఆమెకు తిరిగి బలమైన పునరాగమనాన్ని సాధించడానికి అవసరమైన సహాయం అందిస్తున్నామని చెప్పారు. 2023లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఐమీ మాగ్వైర్, ఇప్పటివరకు 20 క్యాప్‌లను గెలుచుకొని, అన్ని ఫార్మాట్లలో 25 వికెట్లు పడగొట్టింది. ఈ తాజా ఎదురుదెబ్బ ఆమె పురోగతిని తాత్కాలికంగా నిలిపివేస్తున్నప్పటికీ, ఆమె క్రికెట్‌లో ఆశాజనకమైన భవిష్యత్తును ఆశిస్తుంది. ఈ యువ స్పిన్నర్, నిపుణుల మార్గదర్శకత్వంలో తన బౌలింగ్ యాక్షన్‌ను మెరుగుపరచుకొని, త్వరలో అంతర్జాతీయ క్రికెట్‌లో తిరిగి సత్తా చాటేలా కృషి చేస్తోంది.
ఈ పరిస్థితి మాగ్వైర్‌కు కష్టమైన సమయంలో వచ్చినప్పటికీ, ఆమెలో ఉన్న మానసిక శక్తి, అంగీకారం, అభివృద్ధికి ఆదేశాలు ఆమెను మరింత బలపరచడానికి సహాయపడతాయి. ఈ వివాదం తర్వాత, ఆమెకు సంబంధించి క్రికెట్ ఐర్లాండ్ నుండి అందగా నిలిచిన మద్దతు ఆమెకు ప్రేరణగా మారింది. మాగ్వైర్ ఇప్పటికే యువ స్పిన్నర్‌గా ఎంతో ప్రతిష్టాత్మకమైన ప్రదర్శనలను అందించింది. ఆమెకు అందుబాటులో ఉన్న అధిక-పెర్ఫార్మెన్స్ కోచింగ్, మద్దతు సర్వీసులు, అనుభవజ్ఞులైన నిపుణుల మార్గదర్శకత్వం, ఆమెను తిరిగి పటిష్టమైన స్థాయికి తీసుకు వెళ్లే దిశగా కీలకపాత్ర పోషించనున్నాయి. మాగ్వైర్ ఇలాంటి కష్టాలను ఎదుర్కొంటూ, జట్టుకు మరింత బలంగా చేరుకునే లక్ష్యంతో తన బౌలింగ్ యాక్షన్‌పై మరింత శ్రద్ధ పెట్టి, తిరిగి ఐర్లాండ్ క్రికెట్ జట్టుకు సేవలందించే ఆసక్తి కలిగి ఉన్నది. ఈ క్రొత్త సవాళ్లతో, ఆమెకు తిరిగి అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించడానికి ఉన్న ఆశలు సంతృప్తిగా ఉంటాయని ఆశించవచ్చు. ఐసీసీ తరపున వచ్చిన ఈ నిర్ణయంతో, బౌలింగ్ యాక్షన్‌ను మెరుగుపరచుకునేందుకు ఆమె పెట్టుకునే కృషి అనివార్యంగా పునరుద్ధరించబడుతుందని ఈ పరిణామం ఆమెను మరింత దృఢమైన క్రికెట్ ప్లేయర్‌గా మారుస్తుందని ఆశించవచ్చు.

KR TV క్రాంతి
శుక్రవారం 07 ఫిబ్రవరి 2025
సినిమా న్యూస్
epaper.krtvnews.com

# నితిన్‌కు విలన్‌గా.. ఆదిపురుష్ హనుమంతుడు..



మూవీ న్యూస్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):'ఆదిపురుష్' చిత్రంలో హనుమంతుడి పాత్రతో మెప్పించిన హిందీ నటుడు దేవదత్త నాగే.. తెలుగులో విలన్‌గా బిజీ అవుతున్నాడు. ఇప్పటికే 'దేవకీ నందన వాసుదేవ' చిత్రంలో విలన్‌గా నటించిన అతను.. నితిన్ సినిమాలోనూ విలన్‌గా నటిస్తున్నాడు.నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రాబిన్ హుడ్'. బుధవారం (ఫిబ్రవరి 5) దేవదత్త నాగే పుట్టినరోజు సందర్భంగా విషెస్ చెబుతూ తన లుక్‌ను రివీల్ చేశారు.

లాంగ్ హెయిర్, గుబురు గడ్డం, పంచె కట్టుతో భీకరంగా కనిపించాడు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ మూవీ మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# రంగస్థలాన్ని మించేలా క్లైమాక్స్...



మూవీ న్యూస్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా కూడా అదే బాటలో నడుస్తున్నాడు. 'ఉప్పెన' క్లైమాక్స్ మరచిపోని విధంగా తీర్చిదిద్దారు. ఆ సినిమా మొత్తాని క్లైమాక్స్ హైలైట్ అని చెప్పొచ్చు. గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ కెరీర్‌కు 'రంగస్థలం' బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్. అందులో చిట్టిబాబుగా చరణ్ నటన వేరే లెవల్ అన్నట్లు ఉంటుంది. సినిమాలో ప్రతి సన్నివేశం కీలకమే అయినా క్లైమాక్స్ మాత్రం అంతకుమించి అన్నట్లు సుకుమార్ చిత్రీకరించారు. దాని వల్లే సినిమా ఓ రేంజ్‌కి వెళ్లింది. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా కూడా అదే బాటలో నడుస్తున్నాడు. 'ఉప్పెన' క్లైమాక్స్ మరచిపోని విధంగా తీర్చిదిద్దారు. ఆ సినిమా మొత్తాని క్లైమాక్స్ హైలైట్ అని చెప్పొచ్చు.

ఇప్పుడు రామ్ చరణ్‌తో బుచ్చి ఓ సినిమా చేస్తున్నారు. మైత్రీ మూవీస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం భారీ హంగులతో రూపుదిద్దుకొంటోంది. ఈ సినిమా పతాక సన్నివేశాలు కూడా 'నెవర్ బిఫోర్' అనే రేంజ్‌లో రాసుకొన్నాడట బుచ్చిబాబు. ఈ క్లైమాక్స్ మాక్స్ చాలా కాలం గుర్తుండిపోతుందని, మళ్లీ మళ్లీ ఈ క్లైమాక్స్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తుందన్నది ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్‌లో జరిగే కథ ఇది. దీనికి 'పెద్ది' అనే టైటిల్ పరిశీలిస్తున్నారు. పాన్ ఇండియా సినిమా కాబట్టి, అందరికీ అర్థమయ్యే టైటిల్ పెట్టాలనే యోచనలో మేకర్స్ ఉన్నారు.

సుకుమార్ సినిమాల్లో హీరోకి ఏదో ఓ వీక్ నెస్ ఉంటుంది. 'రంగస్థలం'లో చరణ్‌కు సరిగా వినపడదు. అది కథకు బాగా ఉపయోగపడింది. 'ఇప్పుడు ఆర్‌సీ 16లో కూడా రామ్‌చరణ్‌కు పాత్రకు లోపం ఉందని, దానితో నడిపించిన డ్రామా కథని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్తుందని చెబుతున్నారు. ఈ చిత్రం మట్టి లాంటిదని, తన కెరీర్‌కు ఎంతో ఉపయోగపడుతోందని, తన గత చిత్రాలకు మించి ఉంటుందని రామ్‌చరణ్ ఓ సందర్భంలో చెప్పిన విషయం తెలిసిందే! ఇందులో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

# వరుస సినిమాలతో బిజీగా ఉన్న యంగ్ హీరో.



మూవీ న్యూస్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్): ఇండస్ట్రీలో ఫేమ్ సంపాదించుకోవడం అంత ఈజీ కాదనే విషయం మనకు తెలిసిందే. మంచి బ్యాగ్రౌండ్ నుండి వచ్చిన హీరోలు కూడా హిట్ లు లేక సతమతమవుతున్నారు. ఇలాంటి సిచువేషన్ లో చిన్న హీరోలు క్రేజ్ సంపాదించుకోవడం అనేది నిజంగా ఛాలెంజ్ తో కూడుకున్న పని. ఇలాంటి పరిస్థితిలో మంచి స్థానాన్ని సంపాదించుకున్నాడు హీరో తిరువీర్.'జార్జి రెడ్డి, పలాస 1978', 'మసూద' వంటి చిత్రాల్లో తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించాడు.ఇందులో 'మసూద' బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది దీంతో తన కెరీర్‌కి బాగా కలిసోచ్చింది.

ప్రస్తుతం ఈ యంగ్ హీరో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇందులో 'ది గ్రేట్ ప్రీ-వెడ్డింగ్ షో' అనే చిత్రం ఒకటి. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందట. ఈ సినిమాలో తిరువీర్ ఫోటోగ్రాఫర్ పాత్రలో కనిపించనున్నారు. ఇక తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తిరువీర్ తన కెరీర్‌కి సంబంధించిన విషయాలు పంచుకున్నాడు..

తిరువీర్ మాట్లాడుతూ.. ' ఈ 'ది గ్రేట్ ప్రీ-వెడ్డింగ్ షో' మూవీలో వెడ్డింగ్ ఫోటోగ్రాఫర్ పాత్రను పోషించడం చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. మొబైల్‌తో చాలాసార్లు ఫోటోలు తీశాను.. కానీ ఇలా ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్‌గా నటించడం, ఫొటోలు తీయడం చాలా కొత్తగా, ఛాలెంజింగ్‌గా అనిపిస్తోంది. స్టిల్స్ ఎలా పెట్టించాలి, కెమెరాను ఎలా పట్టుకోవాలి.. ఇలా చాలా విషయాలు నేర్చుకున్నాను. అందరినీ ఎంటర్‌టైన్ చేసేలా ఈ సినిమా ఉంటుంది. దీంతో పాటు మరికొన్ని ప్రాజెక్ట్ లు కూడా చేస్తున్నా.. నా కోసమే దర్శకులు పాత్రలను రాస్తుండటం చాలా హ్యాపీగా ఉంది' అని తెలిపాడు.

# నితిన్ 'ఎల్లమ్మ' పూజా కార్యక్రమానికి ముహూర్తం ఫిక్స్





మూవీ న్యూస్ ,06ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):బలగం సినిమాతో దర్శకుడిగా మారి తోలి ప్రయత్నంలోనే సూపర్ హిట్ కొట్టి బలగం వేణుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 2023 లో విడుదలైన ఈ సినిమా ప్రశంసలతో పాటు కాసుల వర్షం కురిపించింది . వేణు ఈ చిత్రానికి గాను జాతీయ అవార్డు సైతం అందుకున్నాడు. ఇదిలా ఉండగా ఈ సినిమా రిలీజ్ అయి చాలా కాలం అవుతున్నా కూడా మరో సినిమాను పట్టాలెక్కించలేదు ఈ దర్శకుడు. బలగం సినిమాను నిర్మించిన దిల్ రాజు బ్యానర్ లోనే తన రెండవ సినిమా చేయాల్సి ఉంది.

అయితే ఈ కథ అందరి చుట్టూ తిరిగి ఫైనల్ గా యంగ్ హీరో నితిన్ దగ్గరకు వచ్చి చేరింది. పలు మార్పులతో మొత్తానికి ఈ సినిమా అక్కడ ఓకే అయింది. ఈ కథకు నిర్మాత దిల్ రాజు ఇప్పటికే యల్లమ్మ అనే టైటిల్ ను రిజిస్టర్ చేసి ఉంచారు. ప్రస్తుతం నితిన్ చేస్తున్నరాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలు చివరి దశ షూట్ లో ఉన్నాయి. ఇక ఇప్పుడు వేణు దర్శకత్వంలో ఎల్లమ్మ సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు నితిన్. కాగా ఈ సినిమాను ఫిబ్రవరి ఎండింగ్ లేదా మార్చ్ లో ముహూర్తం పూజ ఉండనుందట. ఏప్రిల్ లేదా మే నుండి షూటింగ్ మొదలు కానుంది. నితిన్ ను సరికొత్తగా చూపించేందుకు కొత్త మెకోవర్ ట్రై చేస్తున్నాడు దర్శకుడు వేణు యెల్దండి. దాదాపు రెండేళ్లుగా ఈ కథ మీద కసరత్తులు చేస్తున్న వేణు ఈ సినిమాతో నితిన్ కు ఎంత పెద్ద హిట్ ఇస్తాడో చూడాలి.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com